క్లుప్తంగా

జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళా నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు అపూర్వ స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా 276 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. అందులో దాదాపు 139 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక య్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఒకేషనల్ కోర్స్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, సీడాప్ జేడీఎం సూర్యనారాయణ, ప్లేస్‌మెంట్ అధికారి నారాయణస్వామి, మహేష్, తాడిపత్రి స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం పంపిణీలో అవకతవకలపై విచారణ



పొలాలను పరిశీలిస్తున్న విచారణ అధికారులు

గుంతకల్లు రూరల్: మండలంలోని నెలగొండ గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. గత ఆగస్టులో తీవ్రమైన వర్షాల కారణంగా గ్రామంలో తీరని పంటనష్టం జరిగిందని, కొందరికి మాత్రమే నష్టపరిహారం అందజేసి మిగిలిన వారికి ఇవ్వలేదంటూ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇటీవల జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. జేసీ ఆదేశాల మేరకు మంగళవారం అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ శివప్రసాద్, ఏడీఏ పద్మజ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి పంట పొలాలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం 33 శాతం దెబ్బతిన్న పంటలకు మాత్రమే రిహారం అందుతుందని, అంతకంటే తక్కువ పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందదని తెలిపారు. ఈ వివరాలను దృష్టిలో ఉంచుకుని ఫిర్యాదును వెనక్కు తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

చర్మకార సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్



గుత్తి: పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన మంగే రమేష్ రాష్ట్ర చర్మకార సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ మాట్లాడుతూ చర్మ కారుల సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కాగా ఆయన ఎంపికపై ఆ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



సాయి ధనుంజయ (ఫైల్)

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ సెకండియర్ చదువుతున్న యాడికికి చెందిన సాయి ధనుంజయ(20) మంగళవారం ఫిట్స్‌తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. యాడికికి చెందిన చేనేత కార్మికుడు రంగస్వామి కుమారుడు సాయి ధనుంజయ గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. మంగళవారం కాలేజీకి వచ్చిన విద్యార్థికి ఫిట్స్ రావడంతో కుప్పకూలి కింద పడ్డాడు. కాలేజీ యాజమాన్యం, సిబ్బంది గమనించి వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థి మృతిపై గేట్స్ యాజమాన్యం, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

గొర్రెకు శస్త్రచికిత్స



గొర్రెకు ఆపరేషన్ చేసి, మృతి చెందిన గొర్రెపిల్లను బయటకు తీస్తున్న ఏడీ పద్మనాభం

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురానికి చెందిన గోపాలుకు చెందిన ఓ గొర్రె ఈన లేకపోవడంతో, శింగనమల వెటర్నరీ ఏడీ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వెటర్నరీ ఏడీ డా.పద్మనాభం గొర్రెకు పరీక్షలు చేసి, గొర్రె పిల్ల మృతి చెందిందని తెలుసుకున్నారు. వెంటనే సిజేరియన్ ఆపరేషన్ చేసి, గొర్రె పిల్లను బయటకు తీసివేసి, గొర్రెను రక్షించారు. గొర్రెకు యాంటీ బయాటిక్స్, అనాలజీ సిక్స్, ఫ్లూయిడ్స్ ఇచ్చి పంపించారు. శస్త్ర చికిత్సలో వెటర్నరీ సిబ్బంది రంగనాయకమ్మ, చంద్రశేఖర్, నారాయణ స్వామి, రజియా బేగం పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు!

పామిడి ఆక్రమణలమయమవుతోంది. భారీ వర్షం వస్తే పట్టణం ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. తాజాగా మంగళవారం తెల్లవారుజామున అనంతపురం పట్టణ సమీపంలోని పండమేరు పరిసరాల్లో వరద బీభత్సం సృష్టించింది. ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో వేల మంది నిరాశ్రయులయ్యారు. దీనికంతకటికీ కారణం ఆక్రమణలే. పామిడి చుట్టుపక్కలతో పాటు పెన్నా పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు అధికమడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలతో పామిడికి సైతం వరద ప్రమాదం పొంచి ఉందని, అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలంటున్నారు.

- అక్రమార్కుల గుప్పెట్లో కాలువలు, వంకలు, పెన్నా పరివాహక ప్రాంతం
- భవిష్యత్‌లో పామిడికి వరద ముప్పు?





పెన్నానది పరివాహక ప్రాంతంలో ఇటుక బట్టీలు, అక్రమ కట్టడాల దృశ్యాలు

పామిడి: అక్రమార్కులు పామిడి చుట్టూ కాలువలు, వంకలు, పెన్నానదిని ఆక్రమించారు. ముఖ్యంగా పెన్నానది పరిహవాక ప్రాంతం మొత్తం తోటలు, వరిమడులు, ఇటుక బట్టీలు, దేవాలయాల పేరిట ఆక్రమణలమయమైంది. దీనికితోడు వ్యవసాయ కాలువలైన గంగిరెడ్డి కాలువ, పెద్దకాలువలు చెత్తాచెదారంతో కూడిన డ్రైనేజీలుగా మారాయి. అక్రమ కట్టడాలతో కాలువలు కుచించుకుపోయాయి. భారీ వర్షం వస్తే కాలువల గుండా వర్షపునీరు ముందుకు సాగని దుస్థితి. అలాగే స్థానిక పశువులాస్పత్రి వద్ద వంక, ఎద్దులపల్లిరోడ్డులోని కృష్ణవేణి స్కూల్ వద్ద వంక, కరెంటు ఆఫీసు వద్ద వంక, బీసీ కాలనీ, పీ కొండాపురం రోడ్డులోని శ్రీపురం లేఅవుట్ గుండా వెళ్లే వంకలు ఆక్రమణల మయమైయ్యాయి. ఆక్రమణలతో ఈ వంకల నిడివి పూర్తిగా కుంచించికుపోయి డ్రైనేజీ కాలువలను తలపిస్తున్నాయి. మండలంలోని అనుపంల్లి చెరువు మరువ పారినా, చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. లోతట్టు ప్రాంతాలైన నాయీ బ్రహ్మణ కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, చైతన్యకాలనీ, వెంగమనాయుడు కాలనీ, మదీనా కాలనీ, జీసీ కాలనీ, నెహ్రూనగర్ వంటి కాలనీలకు వరద పోటెత్తుతోంది. దీంతో ఆయా కాలనీల్లోని ఇళ్లకు వరదనీటి వ్యథలు తప్పడం లేదు. 25 సెంటీమీటర్ల వర్షం కురిస్తే పామిడి పట్టణం మొత్తం జలదిగ్బంధంలో కొట్టుమిట్టాల్సిందే. నదులు, కాలువలు, వంకల ఆక్రమణే ఈ విపత్తుకు కారణంగా నిలుస్తున్నాయి. నదులు, కాలువలు, వంకల ఆక్రమణలను అరికట్టకపోతే భవిష్యత్‌లో పామిడికి వరద పెనుముంపు పొంచి ఉంది. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆక్రమణలతో కుంచించుకుపోయి డ్రైనేజీలా మారిన జీసీ కాలనీ వంక

ఏరు మాయమవుతోంది



పెన్నానది గతంలో ఇసుక తిన్నెలతో కళకళలాడేది. మేం చిన్నపుడు స్నేహితుల కలిసి పెన్నానది వద్ద సేద దీరేవారం. కాలక్రమేణా నదీ గర్భం మొత్తం ఆక్రమణలమయమైంది. జంటనగరాలైన హైదరాబాద్-సికింద్రబాద్‌కు ట్యాంక్‌బండ్ ఎలాగో అలా పామిడి-కల్లూరు నడుమ పెన్నానది ఉండేది. ఆక్రమణలతో భవిష్యత్‌లో భావితరాలకు ఇక్కడ నదీ ఉండేదని చెప్పాల్సిన దుస్థితి నెలకొంది.

–వీరయ్య, పామిడి

ఆక్రమణలు తొలగించాలి



పామిడిలో నదులు, కాలువలు, వంకలు యదేచ్ఛగా ఆక్రమణల మయమయ్యాయి. దీంతో పైతట్టు ప్రాంతాల్లో వరదలు వస్తే పామిడిలో తట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. వరదలు పోటెత్తితే పామిడికి వరదముప్పు వంటి పెను ప్రమాదం లేకపోలేదు. తద్వారా వాటి ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టి పామిడిని వరదముప్పును నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–రాజు, పామిడి

చర్యలు తీసుకుంటాం



పామిడి సర్వేనంబర్ 1,247 లోనిది పెన్నానది పరివాహక ప్రాంతం. ఈ సర్వే నెంబర్ 968.18 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పెన్నానదితో పాటు కాలువలు, వంకలు ఆక్రమణలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఉత్తర్వుల మేరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడతాం.

–శ్రీధర్‌మూర్తి, తహసీల్దార్

డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టండి

గుంతకల్లు: పట్టణంలోని పాత గుంతకల్లులోని నాగప్ప కాలనీలో వర్షాలకు కూలిపోయిన డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమీషనర్ నయిమ్ అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలోని డిస్పోజల్ డ్రైనేజీ భారీ వర్షాల కారణంగా పడిపోయిందని, ఈ విషయమై మీ కోసంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో కాలవ నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం అంచనాలు తయారు చేశారు. అయితే ఇంతవరకు పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు నేపథ్యంలో ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు జి.లక్ష్మీనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయడానికి మంగళవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో కలసి కమిషనర్ జబ్బార్ మియా ఇంటింటికి తిరిగారు. ఇళ్ల వద్దే పన్నులు వసూలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్నులు పెండింగ్ ఉన్న వారు వెంటనే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పన్నులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ సతీష్ కమలాకర్, ఆర్ఐ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పదో సచివాలయాన్ని కమిషనర్ తనిఖీ చేశారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లాలో ఉన్న అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భోజనం నాణ్యత, తాగునీరు పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



44వ జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లు గుర్తిస్తున్న పోలీసులు

గార్లదిన్నె: మండలంలోని 44వ జాతీయ రహదారిపై ప్రమాద నివారణ చర్యలు చేపడుతు న్నట్లు ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. మంగళవారం నేషనల్ అథారిటీ అధికారి భరత్‌తో కలసి జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ స్థలాలు పరిశీలించామన్నారు. మండలంలోని కల్లూరు, తరిమెల క్రాస్, కనంపల్లి క్రాస్, తలగాచిపల్లి క్రాస్, గార్లదిన్నె విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలు గుర్తించామన్నారు. వాహనాలు అతివేగంగా వెళ్ల కుండా ఆయా చోట్ల స్పీడ్ బ్రేకర్లతోపాటు ప్రమాద సూచికల బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. బ్లాక్ స్పాట్‌ల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

గుత్తి రూరల్: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మండల సమాఖ్య సభ్యులు, వెలుగు సిబ్బంది బాధ్యత తీసుకోవాలని జిల్లా హ్యాండ్ వాష్ కో–ఆర్డినేటర్ ఆర్.లక్ష్మిదేవి సూచించారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత అంశాలపై ఏపీఎంఎఆస్ ఆధ్వర్యంలో వీఓఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, నీటి వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జనను అరికట్టి ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకునేలా చైతన్య పరచాలన్నారు. అనంతరం చేతులు శుభ్రం చేసు కోవడంపై వెలుగు సిబ్బంది, వీఓఏలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం అరుణకుమారి, ఏసీ రాజ్యలక్ష్మి, శ్రీనిధి ఏజీఎం హనుమేష్, వీఓఏలు పాల్గొన్నారు.



హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ లక్ష్మిదేవి

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు: విద్యారంగ సమస్యలు పరిష్కారం కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్ మాట్లాడుతూ పెండింగ్ ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లతోపాటు వసతి దీవెన కింద రూ.1400 కోట్ల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే నెలలో డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పరీక్షలు ఉన్నాయని, గత ఏడాది పెండింగ్‌లో ఉన్న ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని కళాశాల యాజమాన్యులు హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, శివమణి, మధు, వినోద్, శ్రీధర్, భాస్కర్, రాజేష్, రోహిత్, శ్యామ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

గుంతకల్లు రూరల్: మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయంలో మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరితో కలసి ఆధార్ నమోదును పరిశీలించిన ఆమె మాట్లాడారు. ప్రస్తుతం ప్రతి పథకం అమలు ఆధార్‌కార్డుతో ముడిపడి ఉన్నందున.. ఆధార్‌లో ఉన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో సచివాలయంలోనే మొబైల్ ఆధార్ సేవలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డు, పంచాయతీ కార్యాలయంలోని సచివాలయాల్లో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న పర్యవేక్షణలో మంగళవారం ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు కోసం ప్రజలు క్యూకట్టారు. ఈ నెల 25 వరకూ నిర్వహించే ఆధార్‌కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీఓ సూచించారు.



మొబైల్ ఆధార్ సేవలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు

గుత్తి: స్థానిక ముత్యాలమ్మ వీధికి చెందిన వి.బాలకృష్ణపై పోలీసులు మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. వివరాలు.. దాదాపు 200 మందితో బాలకృష్ణ చీటీలు కట్టించాడు. సుమారు రూ.2 కోట్ల మేర వసూలు చేశాడు. ఈ క్రమంలో గత నెల 29న బాలకృష్ణ గుత్తి వదిలి పారిపోయాడు. ఈ క్రమంలో తాము మోసపోయినట్లుగా గుర్తించిన గుత్తిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పద్మజ, శైలజ, కృష్ణవేణి, ప్రదీప్ తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం బాలకృష్ణపై ఎస్‌ఐ సురేష్ చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటోకు నిప్పు

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. పోలీసుల వివరాల మేరకు.. క్రిష్ణమూర్తి అనే వ్యక్తి రోజూ ఆటోలో బూదేడు నుంచి గార్లదిన్నెకు ప్రయాణికులను తరలిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగే సోమవారం రాత్రి ఆటోను ఇంటి ముందర నిలిపిఉంచి, ఇంట్లో నిద్రపోయాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆటోకు నిప్పు పెట్టడంతో మంటల్లో కాలిపోయింది. రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

25న మండల సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలన్నారు.

మృతురాలి వివరాలు లభ్యం

గుత్తి: కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైల్లోని జనరల్ బోగిలో ఈ నెల 20న గుండెపోటుతో మృతిచెందిన మహిళ వివరాలు లభ్యమయ్యాయి. గుత్తి జీఆర్‌పీ ఎస్‌ఐ నాగప్ప మాట్లాడుతూ రైల్లో మృతిచెందిన మహిళ కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన షాహానాజ్ బేగంగా గుర్తించామన్నారు. ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న గ్రామసభలు

యాడికి/గార్లదిన్నె: యాడికి మండలంలోని ఓబుళాపురం, తిమ్మాపురం రెవెన్యూ గ్రామాల్లో మంగళవారం సభలు నిర్వహించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రాజ్‌కుమార్, సర్వేయర్ సుంకన్న, గ్రామ సర్వేయర్‌లు, వీఆర్వోలు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని మర్తాడు, బూదేడులో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. భూ రీ సర్వే డీటీ దివాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని చింతవనం ఆంజనేయస్వామి గుడి వద్ద మట్కా రాస్తున్న కె.కరుణాకర్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని పోలీసులు మంగళవారం తెలిపారు. అతడి నుంచి రూ.3,400 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

తాడిపత్రి అర్బన్: నాటుసారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతడి నుంచి 100ఎంఎల్ సామర్థ్యం గల 73 నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.ఫణీంద్ర మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని చుక్కలూరు రోడ్డులో గంగిరెడ్డి గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న బి.శ్రీరాములు అనే వ్యక్తి సాయంత్రం సమయంలో నాటు సారా విక్రయించేవాడు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అతడిని అరెస్టు చేశారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయం ప్రారంభం

పామిడి: పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయాన్ని ప్రారంభించారు. పంచాయతీ ఈఓ ఎం గోపాల్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ మధుసూదన్‌రావు సహకారంతో కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ జూనియర్ అకౌంట్ ఆఫీసర్ విన్సెంట్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది వెంకటేష్, నరసింగ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

యల్లనూరు: మండల కేంద్రంలోని అచ్చుకట్ల వీధిలో నివాసముంటున్న మాజీ ఉప సర్పంచు గౌస్ బీ (80) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఆమె కుమారుడు, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు చాంద్‌బాషా తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, ఇతర నాయకులు మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పలువురు మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

యల్లనూరు: మండలంలోని వెన్నపూసపల్లికి చెందిన ఓబులేసును ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ఘటనలో మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. బాధితురాలు సుజిత ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

పామిడి: సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని ఖాదర్‌పేట, అనుంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏఓ లీనా వసుంధర ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు ఆయా గ్రామాల్లోని కంది, పత్తి, జొన్న పంటల సాగును పరిశీలించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కే సుశీలమ్మ, నారాయణస్వామి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, టీడీపీ మండల కన్వీనర్ మునలిరెడ్డి, ఏఈఓ శ్రీనివాసరావ్, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పామిడి: ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 విభాగానికి సంబంధించి వెస్ట్ గోదావరి జిల్లాలోని మార్టేరులో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో డీ కీర్తి, బాల్‌బ్యాట్‌మంటన్ పోటీల్లో డీ శ్రీలేఖ, ఎం.మధుసూదన్, శ్రీహరి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అలాగే అన్నమయ్య జిల్లా అంగళ్లలో జరిగిన అండర్–14 బాల్‌బ్యాట్‌మింటన్ పోటీల్లో ప్రణయ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యింది. క్రీడాకారులను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బీ సరిత, పీడీ ఎస్ శిరీష అభినందించారు.

చిక్కవడియార్ చెరువులోకి భారీ వరద



గార్లదిన్నె మండలం మర్తాడులో నేలకొరిగిన వరి పంట



బుక్కరాయసముద్రం చెరువులోకి చేరుతున్న వర్షపు నీరు



పార్నపల్లి డ్యాం వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఈఈ రాజశేఖర్, డీఈ దివాకర్‌రెడ్డి

బుక్కరాయసముద్రం/శింగనమల/గార్లదిన్నె/నార్పల: జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకూ కురిసిన వర్షాలకు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని చిక్కవడియార్ చెరువులోకి వరద నీరు భారీగా చేరుతోంది. రాప్తాడు, చెన్నేకొత్తపల్లి పల్లి, రామగిరి, కనగానిపల్లి మండలాల్లో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు పొంగి పొర్లడంతో వరద నీరు ఆర్డీటీ స్టేడియం సమీపంలోని పండమేరు మీదుగా బీకేఎస్ చెరువులోకి చేరుతోంది. బీకేఎస్ శివారు ప్రాంతమైన టీవీ టవర్ ప్రాంతంలో చెరువుకు పక్కన గుడిసెల్లోకి వరద నీరు చేరడంతో నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అదే విధంగా బీకేఎస్ మండలంలోని గోవిందపల్లి, వడియంపేట, రెడ్డిపల్లి గ్రామాల్లో 77 ఎకరాల్లో వరి పంట నేలకొరింగిది. అలాగే శింగమనలో 32.4 మీ.మీ వర్షపాతం నమోదైందని ఏఓ అన్వేష్ కుమార్ తెలిపారు. అదేవిధంగా భారీ వర్షాలకు గార్లదిన్నె మండల వ్యాప్తంగా వరి 122 ఎకరాలు, వేరుశనగ 11 ఎకరాలు, పత్తి 22 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ఏఓ సోమశేఖర్ తెలిపారు. అలాగే నార్పల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాలు మొత్తం జలమయ్యాయి. ఈఓఆర్డీ శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

అప్రమత్తంగా ఉండండి

యల్లనూరు: చిత్రావతి నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీబీసీ ఇరిగేషన్ ఈఈ రాజశేఖర్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరుగుతుండడంతో అర్ధరాత్రి ఏక్షణమైనా రెండు లేక మూడు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పార్నపల్లి రిజర్వాయరులో 8 టీఎంసీల నీరు ఉందని, 9 టీఎంసీ నీరు రాగానే 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తామన్నారు.

వీరజవాన్‌కు నివాళి

యాడికి(పెద్దవడుగూరు): ప్రజారక్షణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగనిరతి స్ఫూర్తిదాయకమని పెద్దవడుగూరు ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం పెద్దవడుగూరు మండలంలోని గుత్తి అనంతపురం పంచాయతీ కొత్తపల్లికి చెందిన అమరుడైన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి.. అక్కడ వీర జవాను విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాజలి ఘటించారు. సుధాకర్ రెడ్డి సోదరుడు చిన్నపరెడ్డి, పోలీసులు గంగచంద్ర, మనోహర్, సూర్య నారాయణ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

యాడికి: మండలంలోని వేములపాడు యూపీ స్కూల్‌లో చదివే విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరాబాద్‌లో స్థిర పడిన మండలంలోని రాయల చెరువు గ్రామానికి చెందిన మాదాల సంజీవరాయుడు కుమారుడు నవీన్ కుమార్ సహకారంతో పుస్తకాలు అందజేశామని ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

శింగనమల: మండల కేంద్రానికి సమీపంలోని మరువకొమ్మ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం సాయంత్రం అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6170 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

14 మంది మట్కా నిర్వాహకుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో 14 మంది మట్కా నిర్వాహకులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2.19లక్షలను స్వాధీనం చేసుకున్నామని అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. నిందితులు మకందర్ ఆరీఫ్‌బాషా, చంద్రశేఖర్, సాదిక్, వరుణ్ కుమార్, షెక్షావలి, మహమ్మద్ మగ్దూం, బాలనారాయణ, మహబుబ్, సాహిదా, మన్సూర్, జ్యోతి, వన్నూర్‌బీ, నౌషాద్, కుళ్లాయప్పపై కేసు నమోదు చేశామన్నారు.

బాకీ చెల్లించమని అడిగినందుకు కత్తితో దాడి

తాడిపత్రి అర్బన్: తీసుకున్న బాకీ డబ్బులను తిరిగి చెల్లించమని అడిగినందుకు ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. అర్బన్ సీఐ సాయిప్రసాద్ వివరాల మేరకు.. పట్టణానికి చెందిన సాయికుమార్ అనే వ్యక్తి కొద్ది రోజుల క్రితం శ్రీహరి అనే వ్యక్తికి అప్పుగా రూ.లక్ష ఇచ్చాడు. మంగళవారం రాత్రి సీబీ రోడ్డులోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద ఎదురుపడిన శ్రీహరిని అప్పు చెల్లించాలని కోరగా.. కత్తితో సాయికుమార్‌పై దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.